ఈనాడు
మహబూబాబాద్
సోమవారం అక్టోబరు 21, 2024

'రైతులను ముంచిన కాంగ్రెస్'




మహబూబాబాద్‌లో ధర్నా చేస్తున్న ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్, భారాస నేతలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచిందని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్ రావు, మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్‌నాయక్ ఆరోపించారు. రైతుభరోసా పథకం అమలులో రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ భారాస రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆదివారం జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారాస ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు యాసంగి సీజన్‌కు సంబంధించి రైతుభరోసా ఇస్తామంటూ ప్రకటన చేయడం రైతులను మోసం చేసినట్లు కనిపిస్తుందన్నారు. రూ. రెండు లక్షలు రుణమాఫీ చేయలేదు.. వానాకాలం పంటలకు రైతు భరోసా ఇవ్వలేదని ధ్వజమెత్తారు. ఈ ప్రభుత్వానికి రైతుల ఉసురు తగులుతుందన్నారు. భారాస నాయకులు పర్కాల శ్రీనివాసరెడ్డి, మార్నేని వెంకన్న, రఘు, బానోతు రవికుమార్, తేళ్ల శ్రీనివాస్, ఎండీ. ఫరీద్, జేరిపోతుల వెంకన్న, ఎడ్ల వేణు, ముత్యం వెంకన్న, సంతోష్, బూర్ల ప్రభాకర్, నీలేశ్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

పెద్దదిక్కు లేక.. కన్నీళ్లు ఆగక!

అన్నదాతల ఆత్మహత్యలు.. కుటుంబాల్లో కల్లోలం



ఆరుగాలం కష్టపడుతూ.. చెమట ధారలతో నేలను తడుపుతూ సాగునే నమ్ముకున్న అన్నదాతలు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. పెరుగుతున్న సాగు పెట్టుబడులు.. కుటుంబ పోషణ.. పిల్లల చదువులు.. వైద్య ఖర్చులకు చేస్తున్న అప్పులు తీరక తీవ్ర మనోవేదన చెందుతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఈ పది నెలల కాలంలో దాదాపు 25 మంది దాకా బలవన్మరణాలకు పాల్పడటం కలవరపెడుతోంది. వీరిలో కౌలు రైతులు కూడా ఉన్నారు. యువ రైతులు సైతం బలవన్మరణం చెందడంతో చిన్నతనంలోనే వితంతువులుగా మారిన మహిళలు అప్పులు ఎలా తీర్చాలో.. పిల్లలను ఎలా పెంచి పెద్దచేయాలో తెలియక తల్లడిల్లుతున్నారు. ఈ నేపథ్యంలో కుటుంబ పెద్ద దిక్కును కోల్పోయిన కుటుంబాల దయనీయ పరిస్థితిపై కథనం.

ఈనాడు, మహబూబాబాద్

కౌలు రైతు కుటుంబం.. కష్టాలపాలు



వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం కొత్తపల్లికి చెందిన పోశాల రాజబాబు(45) వ్యవసాయంపై మక్కువతో పదేళ్లుగా మూడెకరాలు కౌలుకు తీసుకుని పంటల సాగు చేసేవారు. ఆశించిన దిగుబడులు రాక, అప్పులు పెరిగి సుమారు రూ.15 లక్షలకు చేరాయి. కుటుంబ పోషణ భారంగా మారడంతో రాజబాబు మద్యానికి బానిసయ్యారు. ఈ క్రమంలో ఈ నెల 16వ తేదీ రాత్రి గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. కుమారులు సుశాంత్, అభిరామ్ చదువుల ఖర్చులతోపాటు అప్పులను తీర్చే బాధ్యత తనపై పడిందని.. కూలీ పనులకు వెళ్లినా కష్టాలు తీరేలా లేవని భార్య సువర్ణ రోదిస్తోంది. – వర్ధన్నపేట

అప్పులోళ్ల ఒత్తిడి భరించలేక..



వరంగల్ జిల్లా గీసుకొండ మండలం ఆరెపల్లికి చెందిన గువ్వాడి మోహన్ రావు(32), భార్య కృష్ణవేణి (28) మూడెకరాల్లో పత్తి, మొక్కజొన్న సాగు చేసేవారు.. దీంతోపాటు మోహన్‌రావు వరంగల్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తుండేవారు. సాగు పనులకు రూ.3 లక్షల మేర అప్పు చేశారు. మోహన్‌రావు రోజు పనికి వెళ్లిన తర్వాత.. అప్పులోళ్లు ఇంటికి వచ్చి అడుగుతుండటంతో భార్యాభర్తల మధ్య గొడవకు దారితీసింది. అప్పులు తీర్చే మార్గం లేక మార్చి 3న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. దిక్కుతోచని పరిస్థితిలో కృష్ణవేణి ఐదేళ్ల, రెండున్నరేళ్ల పిల్లలను నాన్నమ్మ వద్ద ఉంచి కూలీకి వెళ్తోంది. – గీసుకొండ

అప్పుడు కూతురు.. ఇప్పుడు తండ్రి



భూపాలపల్లి జిల్లా కాటారానికి చెందిన కొండ రాజబాపు(45) కౌలు రైతు.. నాలుగెకరాలు కౌలుకు తీసుకొని పత్తి వేశారు. సుమారు రూ.11 లక్షలకు పైగా అప్పులు చేయాల్సి వచ్చింది. ఆశించిన దిగుబడులు రాకపోవడం.. కుటుంబ పోషణ భారమవుతోందనే వేదనతో రాజబాపు పురుగు మందుతాగి ఈ నెల 6న మృతి చెందారు. మూడేళ్ల కిందట పదో తరగతి చదువుతున్న కూతురు.. ఇప్పుడు ఇంటి యజమాని ఆత్మహత్య చేసుకోవడం కుటుంబానికి తీరని లోటుగా మారింది. అప్పులు, కుమారుడికి చదువులు చెప్పించే బాధ్యత భార్య రాజేశ్వరిపై పడింది. కష్టాలు గట్టెక్కేందుకు గ్రామంలో కూరగాయలు విక్రయిస్తున్నానని.. కన్నీరు పెట్టుకుంది. –కాటారం

నమ్ముకున్న చేనులోనే..



భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పల్గుల గ్రామానికి చెందిన పలిశెట్టి మొండయ్య(45) అరెకరం భూమిలో పత్తి సాగు చేసేవారు. భార్య లావణ్య కూలి పనులకు వెళ్లేది. మూడేళ్ల నుంచి గోదావరి వరద ముంపుతో సాగు చేసిన పత్తిలో దిగుబడులు రాక అప్పుల ఊబిలో కూరుకుపోయారు. పెట్టుబడి, ఇంటి పోషణకు చేసిన రూ.8 లక్షల అప్పులో రూ.4 లక్షలు తీర్చారు. మిగతావి తీర్చేందుకు ఇబ్బందులు ఎదురవడంతో మనోధైర్యం కోల్పోయిన మొండయ్య పంట చేలోనే చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. లావణ్య బాధను దిగమింగుతూ రోజూ కూలీ పనులకు వెళ్తోంది. – కాళేశ్వరం

పరిష్కారాలు ఇలా..

- వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలి
- ప్రత్యామ్నాయ పంటలకు మద్దతు ధర ప్రకటించి రైతులకు భరోసా కల్పించాలి.
- మిర్చి, పత్తి పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు ముందస్తు సూచనలు చేయాలి.
- ఎరువులు, పురుగు మందుల ధరలు నియంత్రించి రైతులపై భారాన్ని తగ్గించాలి
- ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి.

భూమి అమ్మి తీర్చేందుకు..



మహబూబాబాద్ జిల్లా కురవి మండలం హరిదాస్‌తండా పంచాయతీ శివారు హర్యాతండాకు చెందిన భూక్య హత్తీరాం(33), భార్య మీన(28) ఎకరంన్నర భూమికి తోడుగా మరో ఎకరంన్నర కౌలుకు తీసుకుని మూడెకరాల్లో మిరపసాగు చేశారు. గత నెలలో కురిసిన భారీ వర్షాలకు మిరప తోటలో నీటి ఊట పెరిగి వేరుకుళ్లు తెగులు సోకి పంటంతా ఎండిపోయింది. పెట్టుబడికి రూ.2.50 లక్షలు, అంతకుముందు చేసిన పాత అప్పులు రూ.4 లక్షలు తీర్చడం కష్టమని భావించిన హత్తీరాం మనస్తాపంతో సెప్టెంబరు 6న పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. నాటి నుంచి మీన కుటుంబ బాధ్యతను తీసుకుని రూ.40 వేలు అప్పు చేసి మళ్లీ మిరప సాగు చేస్తోంది. అప్పులు తీర్చడానికి 20 గుంటల భూమిని విక్రయించాలని అనుకుంటున్నానని రోదిస్తూ చెప్పింది. – కురవి

రైతులు ఆత్మస్థైర్యం కోల్పోవద్దు

- విజయ్ భాస్కర్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి, భూపాలపల్లి

వ్యవసాయంలో ఒడుదొడుకులు సహజం.. అనుకున్న దిగుబడి రాకపోవడం, అకాల వర్షాలు, వరదలతో పంట మునగడం వంటి సందర్భాల్లో ఆత్మస్థైర్యం కోల్పోవద్దు. అవసరమైన సలహాలు, సూచనలు అందించడానికి వ్యవసాయ శాఖ తరఫున సిద్ధంగా ఉన్నాం. చాలా మంది అన్నదాతలు అర్హత ఉండీ రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవడం లేదు.. పంట సాగుకు సంబంధించి అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నాం.

సొంత భవనాల్లేని పంచాయతీలు!



మొండ్రాయిగూడెంలో అసంపూర్తిగా..

కొత్తగూడ, న్యూస్‌టుడే: ఏజెన్సీ ప్రాంతంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యాలయాలకు సొంత భవనాలకు కరవయ్యాయి.. ఐదేళ్ల కిందట నూతన పంచాయతీలుగా ఆవిర్భవించి నప్పటికీ పలు గ్రామాలోల సొంత భవనాల్లేక అద్దె గదులు, ఇతర ప్రభుత్వ భవనాల్లో తాత్కాలికంగా కొనసాగుతున్నాయి. ఏజెన్సీ మండలాలైన కొత్తగూడ, గంగారం, బయ్యారం, గూడూరు మండలాల్లో సొంత భవవనాల్లేని గ్రామాలున్నాయి. దీంతో పంచాయతీ సిబ్బంది, పాలక మండలి సమావేశాలు, గ్రామసభల నిర్వహణ కోసం ఇబ్బందులు తప్పడం లేదు.

కొత్తగూడ మండలంలో..

మొండ్రాయిగూడెం, గుండం, రేన్యతండ, గోపాలపురం, దుర్గారం, తాటివారివేంపల్లి, రామన్నగూడెం, కోనాపురం, కొత్తపల్లి, గుంజేడు, చెర్వుముందుతండ, కార్లాయి పంచాయతీలు సొంత భవనాల్లేక ఇబ్బందులు పడుతున్నారు. కొన్నింటికి నిర్మాణాలు ప్రారంభించినప్పటికీ అసంపూర్తిగా నిలిచిపోయాయి.

గంగారం: జంగాలపల్లి, తిరుమలగండి, కొడిశెలమిట్ట, బావురుగొండ, చింతగూడెం, కామారం, దుబ్బగూడెం పంచాయతీలకు సొంత భవనాలు కరవయ్యాయి.

బయ్యారం: కోటగడ్డ, కాచనపల్లి, కస్తూర్ నాగారం, సంతులాల్‌పూటతండా, సింగారం పంచాయతీలకు సొంతభవన నిర్మాణాలు ప్రారంభం కాలేదు. మరో 12 పంచాయతీలకు నిర్మాణాలు ప్రాంభమైనప్పటికీ పూర్తిస్థాయిలో పనులు జరగలేదు.

గూడూరు: బ్రాహ్మణపల్లి, చక్రుతండా, జంగుతండా, లక్ష్మీపురం, ఊట్ల, గోవిందాపురం, మర్రిమిట్ట, పాటిమీదితండా, వెంగంపేట అద్దె గదిలో కొనసాగుతున్నాయి. భూపతిపేట, చిన్నఎల్లాపురం, చిర్రకుంట, దుబ్బగూడెం, శ్రీహనుమాన్‌తండా, ఎర్రకుంటతండా, జగన్ నాయకులగూడెం, కోబాల్‌తండా, పడమటి తండా సొంత భవనాల్లేక ప్రభుత్వ తాత్కాలిక భవనాల్లో కొనసాగుతున్నాయి.



గుండంలో పదేళ్లుగా కొన'సాగు'తూ..

ప్రతిపాదనలు పంపాం

- రాజలింగం, పీఆర్ డీఈ

సొంత భవనాల్లేని పంచాయతీల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మంజూరు కాగానే భవన పనులు ప్రారంభిస్తాం. పలు చోట్ల నిలిచిపోయిన భవనాల పనులు పూర్తిచేసేలా తగిన చర్యలు చేపడతాం.

బాధిత కుటుంబాలకు ఎంపీ పరామర్శ

కేసముద్రం, న్యూస్‌టుడే: కోరుకొండపల్లి శివారు మేగ్యాతండాకు చెందిన లకావతు మౌనిక పిడుగుపాటుతో శనివారం మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ఆదివారం ఎంపీ బలరాంనాయక్ పరామర్శించారు. ప్రభుత్వం నుంచి తగిన సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. ఉప్పరపల్లి గ్రామంలో బోనగిరి ఎల్లమ్మ, కోమటిరెడ్డి ముత్తిరెడ్డి మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేసముద్రం మార్కెట్ ఛైర్మన్ గంట సంజీవరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు అల్లం నాగేశ్వర్‌రావు, పీసీసీ సభ్యుడు దస్రూనాయక్, రావుల మురళి, బండారు దయాకర్, చిదిరాల వసంతరావు, వేముల శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

వైభవంగా స్వామివారి తెప్పోత్సవం



గార్ల, న్యూస్‌టుడే: మర్రిగూడెం సమీపంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం తెప్పోత్సవాన్ని నిర్వహించారు. తొలుత ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవి ఉత్సవ విగ్రహాలతో ఆలయ ప్రాంగణంలోని కోనేటిలో తెప్పోత్సవాన్ని భక్తుల సమక్షంలో ఏర్పాటు చేశారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదాలను వితరణ చేశారు. ఈవో సమత, ఎన్నారైలు డాక్టర్ పులి గోపాలరెడ్డి, ప్రమీల దంపతులు, ధార్మిక కమిటీ సభ్యులు రమేష్‌బాబు, రాములునాయక్, పి.నరేందర్, వేణుగోపాలరావు, బన్సీలాల్, కుటుంబరావు తదితరులున్నారు.

కుమురం భీం ఆశయసాధనకు కృషి

మహబూబాబాద్ రూరల్ (గూడూరు), న్యూస్‌టుడే: ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కుమురం భీం ఆదివాసీల ఆశాజ్యోతి అని తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు ఈసం సుధాకర్ అన్నారు. ఆదివారం గూడూరులో కుమురం భీం వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. కుమురం భీం విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమురం భీం పోరాట ఫలితంగా భారత రాజ్యాంగంలో ఆదివాసీలకు 5వ షెడ్యూల్ రూపకల్పన చేశారన్నారు. అటవీ ప్రాంతంలో 1/59,1/70 చట్టం ప్రకారం పరిపాలన సాగించాలన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో అన్ని ఉద్యోగాలను ఆదివాసీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు బి.సారయ్య, కృష్ణమూర్తి, స్వామి, వెంకన్న, శ్రీనివాసు, దొర పటేల్ కారం లక్ష్మి, సుధాకర్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రుడి సన్నిధిలో భక్తుల సందడి



కురవి, న్యూస్‌టుడే: భద్రకాళీ సమేత కురవి శ్రీవీరభద్రస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం తెల్లవారు జాము నుంచి భక్తులు తరలొచ్చారు. హైదరాబాద్, వరంగల్, ఖమ్మం, జిల్లా నుంచి వచ్చిన భక్తులు బారులు తీరి మొక్కులు చెల్లించుకున్నారు. సంప్రదాయరీతిలో భద్రకాళి ఆలయం చుట్టూ నృత్యాలు చేస్తూ బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తుల రద్దీ పెరగడంతో ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేశారు.

ఉపాధి హామీలో అక్రమాలెన్నో..?



మహబూబాబాద్, న్యూస్‌టుడే

కూలీలకు ఉపాధి కల్పించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిధులు పక్కదారి పడుతున్నాయి. ఉన్నతాధికారుల పర్యవేక్షణలోపం క్షేత్రస్థాయి సిబ్బంది చేతివాటం వల్ల పెద్ద ఎత్తున నిధుల చెల్లింపుల్లో అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలు చేపట్టిన పనులపై క్షేత్రస్థాయిలో పర్యటించి సామాజిక తనిఖీల్లో గుర్తించిన నిధుల చెల్లింపుల అక్రమాలపై అధికారుల ఉదాసీనత వల్ల పక్కదారి పట్టిన నిధులు మళ్లీ తిరిగి జమ కావడం లేదు. జిల్లాలోని 18 మండలాల్లో 14 పర్యాయాలు సామాజిక తనిఖీలు నిర్వహించగా నిధులను కొందరు అధికారులు, సిబ్బంది స్వాహా చేసినట్లు నిగ్గుతేల్చినా తిరిగి అవి వసూలు కావడం లేదు.

సామాజిక తనిఖీల్లో తేలిన అక్రమాలపై రికవరీ సొమ్ము వివరాలు (రూ.లక్షల్లో)

మండలం	రికవరీ చేయాల్సినవి	చేసింది	పెండింగ్
కేసముద్రం	5.96	1.38	4.58
కురవి	3.21	2.06	1.15
చిన్నగూడూరు	1.12	0.35	0.76
పెద్దవంగర	0.86	0.55	0.30
నెల్లికుదురు	4.93	1.91	3.02
మరిపెడ	2.98	5.57	2.42
గార్ల	2.71	8.10	1.90

నిధులు జమ చేయరా?

సిబ్బంది జమ చేయాల్సినవి: రూ.21.80 లక్షలు
చేయించినవి: రూ. 7.64 లక్షలు
చేయాల్సిన సొమ్ము: రూ.14.16 లక్షలు

మహబూబాబాద్ మండలం కంబాలపల్లి గ్రామంలో 608 జాబ్‌కార్డులున్నాయి. కూలీలు 1,363 మంది ఉండగా 2021-22లో 801 మంది 37 పనులు చేశారు. కూలీల చెల్లింపుల్లో అవకతవకలు జరిగినట్లు సామాజిక తనిఖీలో వెల్లడించారు. పని చేయని వారికి ఖాతాల్లో డబ్బులు పడటం, పని చేసిన వారికి చెల్లించకపోవడం లాంటి తప్పిదాలు జరిగాయి. ఆ సొమ్ము రికవరి చేసి పని చేయని వారికి చెల్లించాలని ఆడిట్ సమయంలో ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. పనుల్లో అవకతవకలకు పాల్పడిన వారిపై కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. పని చేయకుండా బిల్లులు కాజేసిన విషయమై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, మహబూబాబాద్, రూరల్

☛ సామాజిక తనిఖీ ప్రజావేదికలో వెలుగుజూసిన నిధుల అవకతవకలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి నోటీసులు జారీ చేసి నిధులు రికవరీ అయ్యేలా చర్యలు తీసుకుంటామని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖాధికారి మధుసూదన్‌రాజు తెలిపారు.

వస్రాం తండాలో అక్రమాలు



నెల్లికుదురులో సామాజిక తనిఖీ ప్రజావేదిక (పాతచిత్రం)

నెల్లికుదురు మండలం వస్రాం తండాలో ఇటీవల 14వ విడత సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో రూ. 4.68 లక్షల అక్రమాలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం బహిరంగ సమావేశంలో వెల్లడించింది. 2021 జులై 1 నుంచి 2023 మార్చి 31 వరకు రూ.79.39 లక్షలు వెచ్చించి పనులు చేపట్టారు. ఈ పనులపై 2024 ఫిబ్రవరి 13 నుంచి 16వరకు సామాజిక తనిఖీ బృందం సభ్యులు తనిఖీలు నిర్వహించారు. 194 పనులు చేయగా 68 పరిశీలించారు. ఫిబ్రవరి 24న మండల స్థాయిలో నిర్వహించిన సామాజిక తనిఖీల్లో రూ.4.68 లక్షల జరిమానా చెల్లించాల్సి ఉందని తేల్చారు. ఇప్పటి వరకు వారు ఎలాంటి సొమ్ము చెల్లించలేదు.

– న్యూస్‌టుడే, నెల్లికుదురు (కేసముద్రం)

25 నుంచి మాలల మహాపాదయాత్ర



కరదీపికలను ఆవిష్కరిస్తున్న మాల మహానాడు నాయకులు

నెహ్రూసెంటర్, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా దళితుల ఐక్యత కోసం ఈనెల 25 నుంచి డిసెంబర్ 1 వరకు భద్రాచలం నుంచి హైదరాబాద్ వరకు నిర్వహించే మాలల మహాపాదయాత్రను విజయవంతం చేయాలని మాల మహానాడు జాతీయ కార్యదర్శి భాస్కర్ కోరారు. ఆదివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట పాదయాత్రకు సంబంధించిన కరదీపికలను ఆవిష్కరించారు. రాష్ట్రంలో మాలల జనాభా తక్కువని అశాస్త్రీయమైన లెక్కలు చూపిస్తూ రాజకీయ పార్టీలను, ప్రభుత్వాలను బ్లాక్ మెయిల్ చేస్తూ ఒక వర్గం పని కట్టుకొని సమాజాన్ని తప్పుదోవ పట్టిస్తోందన్నారు. రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలను కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు మానుకోవాలని డిమాండ్ చేస్తూ జాతీయ మాల మహానాడు, తెలంగాణ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాపాదయాత్రలో అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. మాల మహానాడు నాయకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు వినియోగదారుల సదస్సు


నర్సింహులపేట, న్యూస్‌టుడే: చిన్నగూడూరులోని విద్యుత్తు ఉపకేంద్రంలో సోమవారం నర్సింహులపేట, మరిపెడ, చిన్నగూడూరు మూడు మండలాల విద్యుత్తు వినియోగదారుల సదస్సు నిర్వహిస్తున్నట్లు దానిని జయప్రదం చేయాలని జెన్‌కో ఏఈ పాండునాయక్ తెలిపారు. నర్సింహులపేటలోని కొమ్ములవంచ శివారు రూపప్లాతండాలోని విద్యుత్తు ఉప కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యుత్తు సేవలపై మూడు మండలాల ప్రజలు రాతపూర్వకంగా ఫిర్యాదులు అందించవచ్చన్నారు. సదస్సుకు టీజీఎన్‌పీడీసీఎల్ విద్యుత్తు వినియోగదారుల ఫోరం అధ్యక్షుడు ఎన్.వి. వేణుగోపాలచారి తదితరులు హాజరవుతారన్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఉత్సాహంగా వాలీబాల్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ ఎస్‌జీఎఫ్ఐ(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా) ఆధ్వర్యంలో నిర్వహించిన వాలీబాల్ ఎంపిక పోటీలు ఉత్సాహంగా జరిగాయి. ఆదివారం హనుమకొండ జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలోని వాలీబాల్ కోర్టులో నిర్వహించిన పోటీలకు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన బాలబాలికలు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా వరంగల్ జిల్లా విద్యాశాఖ అధికారి జ్ఞానేశ్వర్ హాజరై పోటీలను ప్రారంభించారు. ప్రతిభ ఆధారంగా అండర్-17 విభాగంలో బాలబాలికల ఉమ్మడి వరంగల్ జిల్లా జట్లను ఎంపిక చేస్తామని వరంగల్ జిల్లా ఎస్‌జీఎఫ్ఐ కార్యదర్శి సారంగపాణి తెలిపారు. కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల పీఈటీ సంఘాల అధ్యక్షులు వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రెడ్డి, రఘువీర్, పీఈటీలు పాల్గొన్నారు.

సేవలు అమరం.. త్యాగం మరవం





● నేటి నుంచి పోలీసు అమరుల సంస్మరణ వారోత్సవాలు

పోలీసులు సమాజ రక్షకులు.. విధి నిర్వహణ కోసం కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ.. అనేక త్యాగాలు చేస్తారు. ప్రజలందరూ సంతోషంగా పండగలు జరుపుకొంటే ఆ సమయాల్లో తాము మాత్రం ప్రత్యేక విధులు నిర్వహిస్తారు. శాంతి భద్రత పరిరక్షణలో తమ ప్రాణాలను సైతం లెక్క చేయరు. విధి నిర్వహణలో అమరులైన వారిని స్మరించుకుంటూ ఏటా అక్టోబరు 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో జరిగిన ప్రధాన ఘటనలపై 'న్యూస్‌టుడే' కథనం.

వరంగల్‌క్రైం, వర్ధన్నపేట, న్యూస్‌టుడే

రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలో నక్సలిజం ఎక్కువగా ఉండేది. పోలీసులు, నక్సల్స్ మధ్య నిరంతరం ఎదురుకాల్పులు జరిగేవి. ఈక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలో డీఎస్పీ నుంచి హోంగార్డు వరకు 61 మంది పోలీసులు అమరులయ్యారు. ప్రాణత్యాగం చేసిన వారిలో అయిదుగురు హోంగార్డులు ఉన్నారు.

1991లో తొలి పేలుడు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1991 జూన్ 15న మొదటిసారిగా మందుపాతర పేలింది. మధ్యంతర ఎన్నికల సమయంలో ఏటూరునాగారం మండలం చెల్పాక గ్రామంలో ఎన్నికల విధుల కోసం వెళ్తున్న సమయంలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఈ ఘటనలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌కుమార్, ఎస్సై కిషోర్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్‌తో పాటుగా అయిదుగురు సీఆర్‌పీఎఫ్ జవాన్లు మృతిచెందారు.

జాకారం వద్ద మందుపాతర

ప్రస్తుత ములుగు జిల్లా జాకారం వద్ద 1996 అక్టోబరు నెలలో జరిగిన మందుపాతర పేలుళ్లలో ఏడుగురు పోలీసులు మృతిచెందారు. అప్పటి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ప్రచారంలో భాగంగా బందోబస్తుకు వెళుతున్న ట్రాఫిక్ సీఐ ఆకుల దామోదర్‌రావు ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు జాకారం వద్ద పేల్చేశారు. ఇందులో దామోదర్‌తో పాటుగా హెడ్ కానిస్టేబుల్ జి.సారయ్య, కానిస్టేబుళ్లు ఎండీ మహమూద్ ఖాన్, డి.వినాయకరావు, పాశికంటి రమేశ్, సి.గోవర్ధన్, ఎం.అశోక్ మృతిచెందారు.

● 1992లో స్టేషన్‌ఘన్‌పూర్ విశ్వనాథపురం వద్ద జరిగిన బాంబు పేలుడులో 13 మంది మృతిచెందారు. ఇందులో 12 మంది బీఎస్‌ఎఫ్ జవాన్లు కాగా ఒకరు డ్రైవర్ ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో మావోయిస్టుల అతిపెద్ద విధ్వంసంగా పోలీసులు ఈ ఘటనను పేర్కొంటారు.

ఠాణాలపై దాడులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మావోయిస్టు ప్రభావం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీసులపై దాడులతో పాటుగా ఠాణాపై దాడులు చేసేవారు. ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఠాణాపై 2001 జులై 29న మావోయిస్టులు దాడి చేసి పేల్చేశారు. ఈ ఘటనలో ఠాణాలో పనిచేస్తున్న మోహన్‌నాయక్ మృతిచెందాడు. పక్కనే ఉన్న దేవాలయంలోని పూజారితో పాటు అటవీశాఖ సిబ్బంది ఒకరు చనిపోయారు. 1991 ఏప్రిల్ 22న నగరం నడిబొడ్డున ఉన్న సుబేదారి ఠాణాను పేల్చేశారు. హెడ్‌కానిస్టేబుల్ టి.సారయ్య, కానిస్టేబుల్ కోటయ్య మృతిచెందారు. హనుమకొండ ఠాణాపైనా మావోయిస్టులు దాడి చేశారు. త్రుటిలో ప్రాణాపాయం తప్పింది. అప్పటి సీఐ గులాంసందానీ లక్ష్యంగా మావోయిస్టులు ఠాణాను పేల్చేశారు. ఈ ఘటనలో ప్రస్తుతం సీసీఎస్‌లో ఏఎస్సైగా పనిచేస్తున్న శివకుమార్ గాయపడ్డారు.

భార్యాబిడ్డలకు టాటా చెబుతూనే..



వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో ఏర్పాటు చేసిన పార్కు

1997లో వర్ధన్నపేట ఠాణా ఎస్సైగా పనిచేస్తున్న రఘును నక్సల్స్ కాల్చి చంపారు. 1992లో పోలీసు ఉద్యోగంలో చేరిన రఘు ఉమ్మడి జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. వర్ధన్నపేట ఎస్సైగా ఉన్న సమయంలో 21-11-1997న మధ్యాహ్నం భోజనం కోసం ఇంటికి వచ్చారు. అదేరోజు సాయంత్రం ద్విచక్ర వాహనంపై ఠాణాకు వెళుతూ.. కూతురు, భార్యకు టాటా చెబుతుండగానే ఇద్దరు వ్యక్తులు వచ్చి తుపాకీతో కాల్చారు. దీంతో ఆయన అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. భార్యాబిడ్డల ముందే తుదిశ్వాస విడిచారు. ఆయన వీర మరణానికి గుర్తుగా వర్ధన్నపేట పోలీసు స్టేషన్‌లో కొంత స్థలాన్ని పార్కుగా ఏర్పాటు చేసి రఘు పేరు పెట్టారు.

మాటువేసి మట్టుబెట్టారు..

భూపాలపల్లిలో 2001 సంవత్సరంలో సీఐగా పనిచేస్తున్న వివేకానందను నక్సల్స్ కాల్చి చంపారు. 1985లో పోలీసుశాఖలో ఉద్యోగంలో చేరిన వివేకానంద నగరంతో పాటు జిల్లాలో పలు ఠాణాల్లో ఎస్సైగా పనిచేశారు. సీఐగా పదోన్నతి రావడంతో బదిలీపై భూపాలపల్లికి వచ్చారు. సింగరేణి అతిథి గృహంలో రాత్రి భోజనం ముగించుకొని జీపులో ఠాణాకు వెళుతుండగా.. మార్గంమధ్యలో మాటువేసిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారి వచ్చి నేరుగా సీఐపై కాల్పులు జరిపారు. దీంతో ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు.



ప్రభుత్వ ప్రయోజనాలు

● మావోయిస్టుల చేతిలో మృతిచెందిన అమరవీరుల కుటుంబ సభ్యుల్లో అర్హత ఉన్న ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పిస్తారు.

● సర్వీస్ కాలం వేతనం మృతుడి సతీమణికి చెల్లిస్తారు.

● ప్రభుత్వం ప్రకటించిన పరిహారం ఇస్తారు.

● ఇంటి స్థలం మంజూరు చేస్తారు.

● 2005లో పోలీసు అమరవీరుల కుటుంబాల సంక్షేమ సంఘం ఏర్పాటైంది. దీని ద్వారా పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతున్నారు.

ఏర్పాట్లు చేశాం..



- అంబర్ కిశోర్ ఝా, పోలీసు కమిషనర్

అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకొని రక్తదాన శిబిరాలు, వ్యాసరచన పోటీలు ఓపెన్ హౌజ్ లాంటి కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు చేశాం. పోలీసుల విధులు, కర్తవ్యాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తాం. ఈ నెల 22న హనుమకొండ, 23న వరంగల్, 24 మామునూరు, 25వ తేదీ పోలీసు కమిషనరేట్, 26న వర్ధన్నపేట, 27 స్టేషన్‌ఘన్‌పూర్, 28 నర్సంపేట, 29 పరకాల, పోలీసు డివిజన్ కేంద్రాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తాం.

పైపులైన్ పగిలి.. భారీగా తాగునీటి వృథా



ఖమ్మం రోడ్డులో పెట్రోల్ పంపు ఎదుట..



మాజీ ఎమ్మెల్యే నరేందర్ నివాసం ముందు రోడ్డుపై..

వరంగల్ జిల్లా ఇసుకఅడ్డా ఖమ్మం రోడ్డులోని పెట్రోల్ పంపు ఎదుట శనివారం అర్ధరాత్రి బల్దియా ప్రధాన పైపులైన్ పగిలింది. దీంతో పెద్దఎత్తున తాగునీరు వృథా అయ్యింది. అర్ధరాత్రి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు లీకేజీ వరద ఆగలేదు. భారీ వర్షం పడినట్లు తాగునీరు ఏరులై పారింది. ఇసుకఅడ్డా నుంచి వరంగల్ అండర్‌బ్రిడ్జి మాజీ ఎమ్మెల్యే నరేందర్ ఇంటివరకు నీరు నిలిచింది. లీకేజీని బల్దియా అధికారులు గుర్తించినా.. రంగశాయిపేట, శంభునిపేట, ఖిలావరంగల్, కరీమాబాద్, ఉర్సు, ఎస్ఆర్‌ఆర్‌తోట, శాంతినగర్ తదితర ప్రాంతాలకు తాగునీటి విడుదల చేయడం వల్ల ప్రధాన పైపులైన్‌కు పడిన లీకేజీని నియంత్రించడం కష్టమైంది. ఆదివారం సాయంత్రం వరకు అన్ని ప్రాంతాలకు నీటి సరఫరా చేశాక.. లీకేజీ నియంత్రణకు చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. మరమ్మతుల నేపథ్యంలో సోమవారం నగరంలోని పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు బల్దియా అధికారులు వివరించారు.

– న్యూస్‌టుడే, శివనగర్(వరంగల్)

రైతు ఇంట.. కొలువుల పంట

రఘునాథపల్లి, న్యూస్‌టుడే : ఓ రైతు కుటుంబం ఇంట.. కొలువుల పంట పండుతోంది.. ఆరుగాలం కష్టించి కుమారులను చదివిస్తే వారిద్దరూ పోటీపడుతూ వరుసగా కొలువులు సాధిస్తున్నారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలం కంచనపల్లికి చెందిన కౌడగాని మైసారావు వినోద దంపతుల కుమారులు మనోజ్, మధు ఒకరు మూడు, మరొకరు నాలుగు ఉద్యోగాలు సాధించి ప్రశంసలందుకుంటున్నారు. చిన్న కుమారుడు మధు ఈ ఏడాది జులై 20న సింగరేణి నిర్వహించిన జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షకు హాజరై ఈ నెల 18న వెలువడిన ఫలితాల్లో ఎంపికయ్యారు. ఆయన 2019లో పంచాయతీ కార్యదర్శిగా ఎంపికై కొంతకాలం విధులు నిర్వహించారు. ఆ వెంటనే న్యాయస్థానం నిర్వహించిన జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగానికి ఎంపికై జనగామ కోర్టులో పనిచేశారు. తర్వాత హైకోర్టు నిర్వహించిన ఎగ్జామినర్ పరీక్షరాసి ఉన్నత ఉద్యోగం సాధించి ప్రస్తుతం అక్కడే విధులు నిర్వహిస్తున్నారు. అంతటితో ఆగకుండా పెద్ద ఉద్యోగంలో చేరాలనే పట్టుదలతో సింగరేణిలో జూనియర్ ఎస్టేట్ అధికారి పరీక్షలో నెగ్గాడు.. పెద్ద కుమారుడు మనోజ్ తమ్ముడు మధుతోపాటే పంచాయతీ కార్యదర్శి కొలువు సాధించారు. మెరుగైన ఉద్యోగం కోసం సాగునీటిపారుదల శాఖలో జూనియర్ అసిస్టెంట్ పరీక్ష రాసి ఎంపికయ్యారు. విధులు నిర్వహిస్తూనే.. సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని మండల గణాంకాధికారి(ఎంపీఎస్‌వో) పరీక్ష రాసి అంతకంటే పెద్ద ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం ఆయన దేవరుప్పుల మండల రెవెన్యూ కార్యాలయంలో గణాంక అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. లక్ష్యం, పట్టుదల ఉంటే ఉద్యోగ పరీక్షలు ఎంత కఠినమైనా సాధించవచ్చని సోదరులు మధు, మనోజ్ తెలిపారు.



తల్లిదండ్రులతో కుమారులు మధు, మనోజ్

పర్యాటక ప్రాంతాల సందర్శన



గణపురం కోటగుళ్లలో శిక్షణ శిబిరం వాలంటీర్లు

వెంకటాపూర్, న్యూస్‌టుడే: యునెస్కో ఆదేశాల మేరకు రామప్పలో కొనసాగుతున్న శిక్షణ శిబిరంలో పాల్గొన్న వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్లు ఆదివారం రామప్ప నుంచి పాండవులగుట్ట, కోటగుళ్ల సందర్శన చేశారు. ఐకోమాస్, ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా, పర్యాటక శాఖ, కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆరో రోజు ఉదయాన్నే యోగా గురువు రాంబాబు ఆధ్వర్యంలో యోగాసనాలు వేశారు. అనంతరం పర్యాటక ప్రాంతాల సందర్శన చేశారు. ముందుగా జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం పాండవుల గుట్ట చేరుకున్నారు. పాండవుల గుట్ట ప్రాశస్త్యం గురించి స్వయంగా తెలుసుకున్నారు. అక్కడ నుంచి గణపురంలోని కాకతీయ కట్టడమైన కోటగుళ్లను పరిశీలించారు. ఆలయ నిర్మాణం, ప్రత్యేకతను చూశారు. కార్యక్రమంలో కాకతీయ హెరిటేజ్ ట్రస్టు, శిక్షణ శిబిరం ఇన్‌ఛార్జి శ్రీధర్‌రావు, అసిస్టెంట్ టూరిజం ప్రమోషన్ ఆఫీసర్ కుసుమ సూర్యకిరణ్, పర్యాటక, పురావస్తుశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ నిర్ధారణ.. 75 శాతమే!

● 12 వేల మంది రైతుల వివరాలు లేవు..

న్యూస్‌టుడే, భూపాలపల్లి కలెక్టరేట్

రుణమాఫీ కాని అన్నదాతలకు ఎదురుచూపులు తప్పడం లేదు.. రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణాలు మాఫీ చేయగా.. చాలా మందికి వర్తించలేదని ఆందోళన వ్యక్తమైంది. ఈ నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికి రుణమాఫీ జరగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వ్యవసాయ శాఖ అధికారులతో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని నిర్వహించింది. మండలాల వారీగా నిర్దేశించిన లక్ష్యం మేరకు ఇంటింటికీ తిరుగుతూ కార్యక్రమం చేపట్టారు. శనివారంతో ఈ కార్యక్రమం పూర్తికాగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 75 శాతమే పూర్తయినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యధికంగా భూపాలపల్లి జిల్లాలో 81 శాతం జరగ్గా, అత్యల్పంగా మహబూబాబాద్ జిల్లాలో 60 శాతమే పూర్తి చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 48,297 కుటుంబాలకు గాను 36,279 కుటుంబాల నిర్ధారణ పూర్తయింది.. ఇంకా 25 శాతం మిగిలిపోవడం గమనార్హం.. వారందరికీ రుణమాఫీ కానట్లేనని అధికారులు అంటున్నారు. మరోవైపు వందశాతం పూర్తి చేయడంలో అధికారులు నిర్లక్ష్యం చేశారని, అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటిస్తే పూర్తయ్యేదని అన్నదాతలు అంటున్నారు.

రూ.2312.01 కోట్ల రుణమాఫీ

రుణమాఫీకి సంబంధించి మూడు విడతల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 2.63 లక్షల మంది రైతులకు రూ. 2312.01 కోట్లను మాఫీ చేశారు. అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 59,140 మంది అన్నదాతలకు రూ. 516.91 కోట్లు, అత్యల్పంగా ములుగు జిల్లాలో 18,696 మంది రైతులకు రూ. 165.53 కోట్లు మాఫీ అయ్యాయి.

క్షేత్రస్థాయిలో ఇలా..

రైతు పంట రుణమాఫీ కార్యక్రమానికి సంబంధించి పథకానికి అర్హులై ఉండి రేషన్ కార్డు లేకపోవడంతో రుణమాఫీ చాలా మంది రైతులకు వర్తించలేదు. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో తిరుగుతూ అర్హులైన కుటుంబాల నిర్ధారణ చేపట్టారు. రైతులకు ముందస్తు సమాచారం అందించి పంచాయతీ, రైతు వేదికల్లో రేషన్ కార్డులేని కుటుంబ సభ్యుల నిర్ధారణ చేపట్టారు. కుటుంబ సభ్యులందరితో సెల్ఫీ తీసుకుని ఆ వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేశారు.



భూపాలపల్లిలో కుటుంబ నిర్ధారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

ఉమ్మడి జిల్లాలో కుటుంబ సభ్యుల నిర్ధారణ వివరాలు

జిల్లా	కుటుంబ సభ్యుల లక్ష్యం	నమోదు	శాతం	రుణమాఫీ పొందిన రైతులు	రుణం మొత్తం (రూ. కోట్లలో)
హనుమకొండ	8359	6934	79.30	49598	408.18
భూపాలపల్లి	5815	4713	81.04	22357	277.31
వరంగల్	8252	6263	75.90	59640	474.76
జనగామ	9947	7762	78.03	54458	469.32
మహబూబాబాద్	10937	6652	60.82	59140	516.91
ములుగు	4987	3955	79.30	18696	165.53

● జిల్లా ● కుటుంబ సభ్యుల లక్ష్యం ● నమోదు ● శాతం ● రుణమాఫీ పొందిన రైతులు ● రుణం మొత్తం (రూ. కోట్లలో)

పూర్తికాకపోవడానికి కారణాలివే..

● సంబంధిత వ్యవసాయశాఖ అధికారులు గ్రామానికి వెళ్లిన సందర్భంలో సదరు రైతు కుటుంబం ఇతర ప్రాంతాల్లో ఉండటం.. వారికి సమాచారం అందించినా రేపు, మాపు అంటూ దాటవేస్తుండటం.

● రుణమాఫీ మరణించిన వ్యక్తులపై ఉండటంతో వారి మరణ ధ్రువపత్రం అందించడంతో పాటు ఆధార్ కార్డు మ్యాచ్ కావాల్సి ఉంటుంది. మరణించిన వ్యక్తి ధ్రువపత్రం సదరు కుటుంబ సభ్యులు సకాలంలో అందించకపోవడం.

● రుణమాఫీలో విదేశాల్లో ఉంటున్న వారి పేర్లు కూడా ఉన్నాయి. అలాంటి వారు ఇక్కడకు వచ్చి కుటుంబ సభ్యుల నిర్ధారణ చేసుకునేందుకు ఆసక్తి చూపకపోవడం.

● ఈ విషయమై జిల్లా వ్యవసాయశాఖ అధికారి విజయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ కుటుంబ నిర్ధారణకు సంబంధించి సమాచారం అందించినా స్థానికంగా లేకపోవడం, ఆధార్ సమస్య, ఆదాయ పన్ను కడుతున్నవారు ముందుకు రాలేకపోయారని అన్నారు.

అండర్-23 క్రికెట్ పోటీలు ప్రారంభం



మాట్లాడుతున్న వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ క్రీడా విభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అండర్-23 క్రికెట్ పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీ సుఖంత్ మైదానంలో నిర్వహించిన పోటీలకు వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన జట్లు హాజరయ్యాయి. ముఖ్య అతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్‌కు దీటుగా వరంగల్‌లో క్రికెట్ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఓరుగల్లులో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన మైదానం నిర్మాణం ఆవశ్యకతను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. అనంతరం ఆయన క్రికెట్ ఆడి సందడి చేశారు. వరంగల్ క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రవీణ్‌గౌడ్, కార్యదర్శి శ్రీనివాస్, రఘురాం, ఉపేందర్, వెంకటేశ్వర్‌రావు, అభినవ వినయ్, మట్టెడ కుమార్, ప్రభాకర్ పాల్గొన్నారు.

మహబూబాబాద్ జట్టు గెలుపు

హనుమకొండ రెడ్డిపురంలోని టీవీవీఎస్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో వరంగల్, మహబూబాబాద్ జట్లు నువ్వానేనా అన్నట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన వరంగల్ జట్టు 29.3 ఓవర్లలో 123 పరుగులకు ఆలౌట్ అయ్యింది. మహబూబాబాద్ జట్టు 30 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 124 పరుగులు చేసి విజయం సాధించింది.

హనుమకొండ ఘన విజయం

మొగిలిచర్ల మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో హనుమకొండ, జనగామ జిల్లా జట్లు పోటీపడ్డాయి. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన హనుమకొండ జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 307-10 పరుగులు చేసింది. జట్టులో రోహిత్‌రెడ్డి 84, వశిష్ఠ 49 పరుగులతో రాణించారు. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన జనగామ జట్టు 27 ఓవర్లలో 128 పరుగులకే కుప్పకూలింది.



ఆట ఆడేస్తా!

ములుగు జిల్లా తాడ్వాయి మండలం బయ్యక్కపేటలో ఆదివారం మంత్రి సీతక్క సందడిచేశారు. బాల్య స్నేహితురాలి కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన ఆమె స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలకు వెళ్లి విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు. అప్పుడే మైదానంలోకి వచ్చిన పిల్లలతో కలిసి వాలీబాల్ ఆడారు. అనంతరం విద్యార్థుల కోసం వండిన వంటలు పరిశీలించి పరిశుభ్రంగా, రుచిగా వండాలని అక్కడి సిబ్బందికి సూచించారు. – న్యూస్‌టుడే, తాడ్వాయి

దరఖాస్తు గడువు పొడిగింపు

కాజీపేట టౌన్, న్యూస్‌టుడే: ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా పలు ఐటీఐల్లో అడ్వాన్స్ టెక్నాలజీ సెంచరీ (ఏటీసీ) కోర్సులను ఏర్పాటు చేయనుంది. తొలి విడతలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏటూరునాగారం, భూపాలపల్లిలోని ప్రభుత్వ ఐటీఐల్లో ఈ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల గడువును ఈ నెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు ఆర్‌డీడీ సీతారాములు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

చికెన్ ధరలు

(కిలో వెల రూపాయలలో)

వెన్‌కాబ్

ఫాం:	120
రిటైల్:	142
డ్రెస్డ్:	206
స్కిన్‌లెస్:	234

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం

దేవరుప్పుల రూరల్, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనంపై అతివేగంగా వస్తూ ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేసే క్రమంలో ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని బలంగా ఢీకొనగా, ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందగా మరో ముగ్గురికి తీవ్ర గాయాలైన సంఘటన జనగామ జిల్లా దేవరుప్పుల మండలం గొల్లపల్లి శివారులో చోటుచేసుకుంది. ఎస్సై సృజన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూలు జిల్లాకు చెందిన బోయ నర్సింహ(20), వనపర్తి జిల్లా మదనాపురానికి చెందిన చీరోలు భరత్(22)లు కొడకండ్ల మండలం రామన్నగూడెంలో ఓ గుత్తేదారు కింద ప్లంబింగ్ పనులు చేస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం సొంత పనుల నిమిత్తం దేవరుప్పులకు వచ్చే క్రమంలో గొల్లపల్లి శివారు వద్ద రోడ్డు దాటుతుండగా, ఎదురుగా వస్తున్న ట్రాలీ వాహనాన్ని ఢీకొనడంతో కింద పడిపోయారు. ప్రమాదంలో ద్విచక్రవాహనంపై ఉన్న బోయ నర్సింహ, చీరోలు భరత్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, ట్రాలీలో ప్రయాణిస్తున్న కొంగరి భాస్కర్, రాపాక రేణుక, రాపాక ఉప్పలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు, ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకొని క్షతగాత్రులను, మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జనగామ ఏరియాసుపత్రికి తరలించారు. మృతుల కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

భారాస శ్రేణుల నిరసన


దోర్నకల్‌లో మాట్లాడుతున్న రెడ్యానాయక్

దోర్నకల్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నమ్మి ఓట్లేసిన రైతుల్ని గద్దెనెక్కాక రేవంత్‌రెడ్డి నట్టేట ముంచారని మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ ధ్వజమెత్తారు. దోర్నకల్‌లో భారాస రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు ఆ పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం ధర్నా చేపట్టారు. రూ.2 లక్షల రుణం మాఫీ చేస్తామని నమ్మబలికిన సీఎం ఇప్పటివరకు 45 శాతం మాత్రమే చేశారన్నారు. 22 లక్షల మంది రుణమాఫీ కోసం ఎదురుచూస్తుండగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరో 3 లక్షల మందికి చేస్తే సరిపోతుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మహబూబాబాద్ ఏఎంసీ మాజీ ఛైర్మన్ విద్యాసాగర్, మాజీ ఎంపీపీ బాలు, పీఏసీఎస్ ఛైర్మన్ విక్రం రెడ్డి, కౌన్సిలర్లు సంధ్యారాణి, అరుణ, జనార్దన్, భారాస నాయకులున్నారు.

నెల్లికుదురు: నెల్లికుదురులో మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ రైతులను మోసం చేసిన ప్రభుత్వాలు పతనమవుతాయన్నారు. శ్రీరామగిరి పీఏసీఎస్ ఛైర్మన్ గుండా వెంకన్న, మాజీ ఎంపీపీ మాధవి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు ఎం.శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

గార్ల: స్థానిక నెహ్రూ సెంటర్లో భారాస మండలాధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్ నాయకులు టి.శ్రీను, ఉమేష్, వెంకటరెడ్డి, యాకూబ్, సంపత్, విజయ్ తదితరులున్నారు.

బయ్యారం: బయ్యారంలో నిర్వహించిన రాస్తారోకోలో మండల అధ్యక్షుడు తాతా గణేష్, శ్రీకాంత్‌నాయక్, సత్యనారాయణ, బలయ్య, మురళీకృష్ణ, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

గూడూరులో భారాస మండల కార్యదర్శి నూకల సురేందర్ యాదవ్, మాజీ ఎంపీపీ వీరన్న, పార్టీ నాయకులున్నారు.

కేసముద్రం, కొత్తగూడ: కేసముద్రంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. నాయకులు నీలం దుర్గేష్, నజీర్‌అహ్మద్, కముటం శ్రీనివాస్, వీరూనాయక్, రవి, సట్ల వెంకన్న, సోమన్న, మోడెం రవీందర్‌గౌడ్, హరినాయక్ పాల్గొన్నారు. కొత్తగూడలో పార్టీ నాయకులు వేణు, నెహ్రూనాయక్, వీరన్న, పరమేష్, బాలకోటయ్య, తదితరులు పాల్గొన్నారు.


గార్లలో


గూడూరులో


ఇనుగుర్తిలో..


నెల్లికుదురులో రాస్తారోకో


కేసముద్రంలో


బయ్యారంలో


కొత్తగూడలో

మేమున్నాం.. మీకు తోడుగా

మహబూబాబాద్ టౌన్: 98859 29762, మహబూబాబాద్: 9441084123, తొర్రూరు టౌన్: 97019 14499, దోర్నకల్: 94405 15786, మరిపెడ: 80085 74823

దోర్నకల్, న్యూస్‌టుడే: ఉల్లాతండాలో వీధి దీపం వెలగడం లేదు. - **కుమార్**

బాగు చేయిస్తాం.- **మున్సిపల్ కమిషనర్, ఎంపీవో, దోర్నకల్**

తొర్రూరు, న్యూస్‌టుడే: డివిజన్ కేంద్రంలోని కురాయపాలెం రోడ్డు, పోస్టాఫీసు వెళ్లే కాలనీలో రోడ్డుపైన చెత్త పేరుకుపోయి, దుర్వాసన వెదజల్లుతోంది. పరిష్కరించాలి. - **ఉపేందర్, రమేష్ కాలనీవాసులు**

సమాధానం: సిబ్బందితో తొలగించి, పరిష్కరిస్తాం. - **ఎం. రామచంద్రయ్య, మున్సిపల్ చైర్మన్, తొర్రూరు**

పొదల తొలగింపు

స్పందనకు వందనం

దోర్నకల్: దోర్నకల్‌లో ఆర్‌యూబీ సమీపంలోని మూలమలుపులో ఉన్న పొదలను పుర సిబ్బంది ఆదివారం తొలగించారు. 'మేమున్నాం...మీకు తోడుగా'కు స్థానికుడొకరు ఈ సమస్యను తెలపగా 'ఈనాడు'లో ప్రచురితమైంది. అధికారులు స్పందించడంతో ఇబ్బందులు తొలగినట్లు వాహనచోదకులు తెలిపారు.

అనుమతిపత్రాలు లేని వాహనాలు సీజ్

తొర్రూరు, న్యూస్‌టుడే: డ్రైవింగ్ లైసెన్స్, అనుమతి పత్రాలు లేని వాహనాలు సీజ్ తప్పదని సీఐ జగదీష్ హెచ్చరించారు. స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా డివిజన్ కేంద్రంలోని అంబేడ్కర్, బస్టాండ్, పాలకేంద్రం, పెద్దచెరువుకు వెళ్లే రోడ్డులో సర్కిల్ పరిధిలోని ఎస్సైలతో కలిసి ఆదివారం రాత్రి ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సరైన ధ్రువపత్రాలు లేని పలువురు ఆటో, ద్విచక్రవాహనదారులపై కేసు నమోదు చేశారు. మైనర్లు వాహనాలు నడిపితే చట్టప్రకారం కఠిన చర్యలుంటాయని సీఐ తెలిపారు. కార్యక్రమంలో సర్కిల్ పరిధిలోని ఎస్సైలు ఉపేందర్, రాజు, క్రాంతికిరణ్, రమేష్‌తోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులకు నేలకొరిగిన వరి


పెద్దవంగర దుర్గామాత ఆలయం సమీపంలో

పెద్దవంగర, న్యూస్‌టుడే : మండల వ్యాప్తంగా శనివారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. దీంతో పలు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. మండల కేంద్రంలోని దుర్గామాత ఆలయం సమీపంలో చేతికొచ్చిన పంట నేలకొరిగి నీటమునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటలు పొట్టకు వచ్చిన దశలో అకాల వర్షంతో తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'సుప్రీం' తీర్పును అమలు చేయాలి

తొర్రూరు, న్యూస్‌టుడే: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును రాష్ట్రంలో వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌ఛార్జి గుగ్గిళ్ల పీరయ్యమాదిగ డిమాండ్ చేశారు. డివిజన్ కేంద్రంలో యాకమల్లుమాదిగ అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టు తీర్పును రాష్ట్రంలో తక్షణమే అమలు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి శాసనసభలో ప్రకటించి నేటికి అమలు చేయకపోవడం విచారకరమన్నారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లు విడుదల చేస్తుండటంతో మాదిగలకు తీరని అన్యాయం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల నాయకులు రజియ, సైదులు, భిక్షపతి, వెంకన్న, భాస్కర్, రవి కిరణ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనుచిత వ్యాఖ్యలు చేశారనడం సరి కాదు

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మహబూబాబాద్ ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్‌పై బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవరెడ్డి, నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారని ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు, మరి కొందరు కాంగ్రెస్ నేతలు చేస్తున్న ప్రకటనలు సరైనవి కావని ఎల్‌హెచ్‌పీఎస్ మండల అధ్యక్షుడు జాటోత్ వీరన్న, గుగులోత్ లక్ష్మణ్, ఇస్లావత్ సుందర్ ప్రకటించారు. మండల కేంద్రంలోని రహదారులు భవనాల శాఖ విశ్రాంతి భవనంలో ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నంగారబేరి నేతలు, కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాదవరెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ నేతలు, కాంగ్రెస్ పార్టీ నేతలు ప్రభాకర్, ప్రణయ్, వెంకటేశ్వర్లు, శ్రీపాల్‌రెడ్డి, ముత్యాలు, బాస్, కిషన్, జాదు, వెంకటేష్, సోమయ్య, తదితరులున్నారు.

గిరిజన బాంధవుడికి నివాళి

కొత్తగూడ, న్యూస్‌టుడే: కుమురంభీం వర్ధంతి కార్యక్రమం సందర్భంగా ఆదివారం కొత్తగూడలో తుడుందెబ్బ, ఆదివాసీ ఉద్యోగుల సంఘం, ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భీంను స్మరిస్తూ ఆయన ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు వట్టం ఉపేందర్, యాదగిరి, రాము, సందీప్, భాస్కర్, సాయిలు, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.


ఇనుగుర్తిలో

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు


కేసముద్రంలో

కేసముద్రం, ఇనుగుర్తి మండలకేంద్రాల్లో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు నిర్వహించారు. కేసముద్రంలోని గీతాంజలి ఉన్నత పాఠశాలలో 1998-99, ఇనుగుర్తి జడ్పీ ఉన్నత పాఠశాల 1981-82 విద్యాసంవత్సరం విద్యార్థులు సమావేశాలకు హాజరయ్యారు. రోజంతా ఆడారు.. పాడారు. బడిలో చదువుకున్న రోజులను గుర్తుకు తెచ్చుకున్నారు. తమకు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

– న్యూస్‌టుడే, కేసముద్రం, ఇనుగుర్తి

గుంతలమయం.. ప్రమాదకరం


రావిరాల బస్టేజీ సమీపంలో

నెల్లికుదురు, న్యూస్‌టుడే: మండలంలోని రావిరాల బస్టేజీ నుంచి గ్రామంలోకి వెళ్లే దారిలో ప్రధాన రహదారికి సమీపంలో ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబదిత శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పైపులైన్ ధ్వంసం.. నిలిచిన నీటి సరఫరా



మరిపెడ, న్యూస్‌టుడే: ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయలోపం, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కారణంగా ప్రజాధనం వృథా అవుతోంది. మరిపెడ మండలం వీరారం గ్రామం వెళ్లే మార్గంలో అటవీశాఖ ఆధ్వర్యంలో రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటేందుకు జేసీబీ యంత్రంతో గుంతలు తవ్విస్తున్నారు. దీంతో మిషన్ భగీరథ తాగునీటి సరఫరా పైపులైన్ పలుచోట్ల ధ్వంసమైంది. సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో తొలుత పైపులైన్ ఉన్న ప్రదేశాలను గుర్తించి నష్టం వాటిల్లకుండా అధికారుల పర్యవేక్షణతో గుంతలు తవ్వి మొక్కలు నాటాల్సి ఉంది. అధికారులు పట్టించుకోకపోవడంతో పైపులైన్ ధ్వంసమై మూడు రోజులుగా వీరారం గ్రామానికి, ఆవాస గిరిజన తండాలకు తాగునీటి సరఫరా నిలిచిపోయింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైపులైన్ మరమ్మతులు త్వరితగతిన చేపట్టి తాగునీటి సరఫరా పునరుద్ధరించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని 'న్యూస్‌టుడే' మిషన్ భగీరథ ఏఈ రాకేష్ దృష్టికి తీసుకెళ్లగా ధ్వంసమైన పైపులైన్ మరమ్మతు పనులు వెంటనే చేపడతామన్నారు.

విద్యుత్తు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

తొర్రూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని ఐఎన్‌టీయూసీ-టీఎస్ ఈఈ-327 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఓ వేడుకల మందిరంలో సంఘం డివిజన్ సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో ఆన్‌మ్యాన్డ్ కార్మికులకు జరిగిన అన్యాయాన్ని సీఎండీ వరుణ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వారి నైపుణ్యాల ఆధారంగా తగిన న్యాయం జరిగేలా చూస్తామన్నారు. ఈ సందర్భంగా ఇతర సంఘాలకు చెందిన వారు ఐఎన్‌టీయూసీలో చేరగా వారికి సభ్యత్వాలు అందించారు. అనంతరం పాలకేంద్రం నుంచి అంబేడ్కర్ కూడలివరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు మహేందర్‌రెడ్డి, బుచ్చయ్య, తులసి, శ్రీనివాస్, సికిందర్, వెంకటేశ్వర్లు, గోవింద్, యాకూబ్ పాల్గొన్నారు.

తొర్రూరు డివిజన్

విప్లవ సాంస్కృతిక ఉద్యమంతోనే మార్పు


మాట్లాడుతున్న ఏపీ అరుణోదయ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు జాలన్న, వేదికపై నాగన్న, గోవర్ధన్ తదితరులు

నర్సంపేట, న్యూస్‌టుడే: దేశంలో పెచ్చరిల్లుతున్న హిందూ బ్రాహ్మణీయ ఫాసిస్టు, భూస్వామ్య సంస్కృతికి ప్రత్యామ్నాయంగా సాంస్కృతిక ఉద్యమాల నిర్మాణంతో ముందుకు సాగాలని అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.జాలన్న, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు నాగన్న పిలుపునిచ్చారు. నర్సంపేటలోని రాయల రమేశ్ నగర్(సిటిజన్స్ క్లబ్)లో ఆదివారం జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర జనరల్ కౌన్సిల్‌లో వారు పాల్గొని మాట్లాడారు. సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ, భూస్వామ్య సంస్కృతికి వ్యతిరేకంగా బలమైన విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని నిర్మించి.. తద్వారా ప్రజలను జాగృతం చేయాలన్నారు. ప్రజా కళలు అంతరించడం వల్ల ఎదురవుతున్న సమస్యలను వివరించారు. 'కళ కాసు కోసం కాదని.. అది ముమ్మాటికి ప్రజల కోసమని' పేర్కొన్నారు. విప్లవ సాంస్కృతిక ఉద్యమం కోసం పోరాడి అమరులైన వారికి జోహార్లు అర్పించారు. అంతకుముందు అమరవీరుల స్తూపం కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా సభావేదిక వరకు ప్రదర్శనగా వచ్చారు. సభలో సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు గోవర్ధన్, ఆహ్వాన సంఘం నాయకులు డా.జగదీశ్వర్, ఐలయ్య, ప్రముఖ కవి, రచయిత యోచన, పీవైఎల్ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి అనురాధ, అరుణోదయ సమాఖ్య నాయకులు అలీ, కోటేశ్వర్‌రావు, ఆహ్వాన సంఘం సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో బోల్తా ఒకరి దుర్మరణం

ఆరుగురికి తీవ్ర గాయాలు


నర్సయ్య మృతదేహం


బోల్తా పడి ట్రాలీ ఆటో

కురవి, న్యూస్‌టుడే: కురవి శివారు జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి అదుపు తప్పి ట్రాలీ ఆటో బోల్తా పడడంతో ఒకరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు, కురవి ఎస్సై సతీశ్ తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సూదనపల్లికి చెందిన నీలం కోటయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. భద్రాచలం గోదావరి నీటిలో అస్థికలు కలిపేందుకు అతని కుటుంబ సభ్యులు ట్రాలీ ఆటోలో వెళ్తున్నారు. కురవి దాటి కొద్ది దూరం వెళ్లగానే మూడు గుడిసెల తండా సమీపంలో 365 జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నీలం నర్సయ్య(64) అక్కడికక్కడే మృతి చెందారు. అతనితో పాటు అదే ఆటోలో ప్రయాణిస్తున్న నీలం కందయ్య, శ్రీలత, వెలగం శివప్రసాద్, మణెమ్మ, నాగమణి, నరేశ్, ఆటో డ్రైవర్ అరుణ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కురవి పోలీసులు క్షతగాత్రులను 108 వాహనాల్లో మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. నర్సయ్య మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం మహబూబాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడికి భార్య పూలమ్మ, కుమారుడు సుధాకర్, కుమార్తె రాధిక ఉన్నారు.

ఉరేసుకొని ఆత్మహత్య

బయ్యారం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాల కారణంగా ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం కొత్తపేట గ్రామంలోని ఎస్సీ కాలనీలో జరిగింది. కొత్తపేట గ్రామానికి చెందిన మరికంటి శేఖర్(41) నాలుగు రోజులుగా మద్యం తాగుతుండటంతో కుటుంబ సభ్యులు గొడవపడ్డారు. ఇంట్లో ఎవరు లేని సమయంలో శేఖర్ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుడి భార్య రమణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని విచారణ చేస్తున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

తాటి చెట్టుపై నుంచి పడి తీవ్ర గాయాలు

మహబూబాబాద్ రూరల్, న్యూస్‌టుడే: తాటి చెట్టుపై నుంచి పడి గీతకార్మికుడికి తీవ్ర గాయాలైన సంఘటన అమనగల్ గ్రామంలో ఆదివారం సాయంత్రం జరిగింది. గ్రామానికి చెందిన పూజారి ఉపేందర్ గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారిపడగా గాయాలయ్యాయి. అతన్ని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చేర్పించారు. మెరుగైన వైద్యం కోసం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

కంప్యూటర్ ఆపరేటర్ అనుమానాస్పద మృతి

హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యుల ఫిర్యాదు


గుమ్మడి మహేష్ (పాత చిత్రం)

గార్ల, న్యూస్‌టుడే: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న గుమ్మడి మహేష్(32) అనుమానాస్పదస్థితిలో సీతంపేటలోని తన నివాసంలో మృతి చెందిన సంఘటన ఆదివారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం ప్రకారం.. మహేష్ బాల్యం నుంచి తన అమ్మమ్మ గ్రామమైన సీతంపేటలోనే ఉంటున్నారు. తండ్రి పాపయ్య, తల్లి వీరకుమారి, తమ్ముడు రాజు కంబాలపల్లి సమీపంలోని టేకులగూడెంలో నివసిస్తున్నారు. చెల్లెలుకు రెండేళ్ల కిందట వివాహం జరిగింది. ఎంపీడీవో కార్యాలయంలో విధులు నిర్వహించారు. సుమారు రాత్రి ఎనిమిది గంటల వరకు సీతంపేటలోని తమ ఇంటికి చేరుకున్నారు. ఆదివారం ఉదయం ఓ వ్యక్తి అతడ్ని కలిసేందుకు వెళ్లారు. ఇంట్లో అతడు మంచంపై విగతజీవిగా పడి ఉండడాన్ని గమనించారు. వెంటనే ఇరుగుపొరుగువారికి చెప్పడంతో వారు పోలీసులకు సమాచారమిచ్చారు. మృతుడి ముఖంపై తీవ్రగాయాలున్నాయి. చరవాణి కూడా ఇంటికి కొద్దిపాటి దూరంలో పడి ఉన్నట్లు సమాచారం. కుటుంబసభ్యులు హత్యగా అనుమానిస్తున్నారు. ఇంటి సమీపంలోని వారే హత్య చేసి ఉంటారని ఆరోపిస్తూ మృతుడి తమ్ముడు రాజు స్థానిక రక్షకభట నిలయంలో ఫిర్యాదు చేశారు. గార్ల, బయ్యారం సీఐ రవికుమార్, ఎస్సైలు జీనత్‌కుమార్, తిరుపతి సంఘటనాస్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని శవపరీక్ష కోసం మహబూబాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఎస్సై జీనత్‌కుమార్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కేసు విషయమై సీఐ రవికుమార్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ప్రాథమికంగా అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు కేసు నమోదు చేశామన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం


గార్లలో క్షీరాభిషేకంలో కాంగ్రెస్ నాయకులు

గార్ల, న్యూస్‌టుడే: తుపాను కారణంగా పంట నష్టపోయిన వారికి ఎకరానికి రూ.10 వేలు ఇవ్వడం హర్షదాయకమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రావూరి వెంకటరామయ్య, పీఏసీఎస్ అధ్యక్షుడు వి.దుర్గాప్రసాద్, జిల్లా నాయకుడు జి.వెంకటరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకట్‌లాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం స్థానిక నెహ్రూ సెంటర్లో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మండల కార్యనిర్వాహక అధ్యక్షుడు కృష్ణగౌడ్, జాతీయ స్త్రీశక్తి అవార్డు గ్రహీత శంషాద్‌బేగం, కె.సత్యనారాయణరెడ్డి, హాతీరాం, కట్టా శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

మూసీ పునరుద్ధరణ అడ్డుకోవాలనే భారాస నేతల రాద్ధాంతం

నర్సింహులపేట, న్యూస్‌టుడే: మూసీ పునరుద్ధరణను అడ్డుకోవాలనే భారాస నేతలు రాద్ధాంతం చేస్తున్నారని యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు చిర్ర సతీష్ అన్నారు. నర్సింహులపేటలో నిర్వహించిన యూత్ కాంగ్రెస్ సమావేశంలో ఆదివారం మాట్లాడారు. మల్లన్నసాగర్, మూసీ బాధితుల వద్దకు పోదాం అంటూ సీఎం రేవంత్‌రెడ్డికి మాజీ మంత్రి హరీష్‌రావు సవాల్ చేయడం పట్ల మండల యువజన కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. భూక్య దేవీలాల్‌నాయక్, దోమల యాదగిరి, కాస యాకయ్య, చల్లా మధురెడ్డి, పలువురు పాల్గొన్నారు.

నష్ట పోయిన వారిని ఆదుకోవాలి

కురవి, న్యూస్‌టుడే: భారీ వర్షాలతో తీవ్రంగా నష్టపోయిన బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం కురవి గ్రామ కార్యదర్శి కృష్ణయ్య అన్నారు. ఆదివారం పార్టీ కురవి గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. వరదలతో జిల్లాలో రైతులు, ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. సమావేశంలో జ్యోతిబస్, శ్రీనుతో పాటు నాయకులున్నారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక

గార్ల, న్యూస్‌టుడే: గార్ల మండలం బాస్కెట్‌బాల్ అసోసియేషన్ నుంచి ఈ నెల 18న మహబూబాబాద్ జిల్లాలో జరిగిన 14, 17 విభాగంలో రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. బాలుర అండర్ 17 విభాగంలో సృజన్‌కుమార్, తౌసిఫ్‌రజా, బాలికల విభాగంలో లక్ష్మి, నవ్య, నిఖిల ఎంపికయ్యారు. అండర్-14 విభాగంలో కూడా వీరు ఎంపికయ్యారు. విద్యార్థులను ఎస్సై జీనత్‌కుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అభినందించారు.

'భాజపా ప్రజలకు చేసింది శూన్యం'

సంక్షిప్తంగా

గార్ల, న్యూస్‌టుడే: పేదలను దోచి పెద్దలకు పంచుతున్న భాజపా ప్రభుత్వంపై పోరాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ కోరారు. పినిరెడ్డిగూడెంలో ఆదివారం బాల, సీతారాం అధ్యక్షతన జరిగిన సీపీఎం శాఖ పదోమహాసభ జరిగింది. కేంద్రంలో భాజపా అధికారంలోకి వచ్చాక కార్మికులు, పేదలు, అణగారినవర్గాలకు ఒరిగిందేమిలేదని తెలిపారు. ప్రశ్నించేవారిపై దాడులు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పదేళ్లపాటు అధికారంలో ఉన్న భారాసా చేసిందేమిలేదన్నారు. తొలుత పార్టీ జెండాను వంగూరి వెంకటేశ్వర్లు ఎగురవేశారు. మండల కార్యదర్శి కందునూరి శ్రీనివాస్, గోవింద్, కొండల్‌రావు, సత్యావతి, నాగమణి, పద్మ తదితరులు ఉన్నారు.

వైకుంఠరథ ఏర్పాటుకు చర్యలు

ఇనుగుర్తి, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో శ్మశానవాటికలు గ్రామానికి దూరంగా ఉండటంతో దహన సంస్కారాల సమయంలో ప్రజలకు ఇబ్బందులకు గురవుతుండడంతో గ్రామంలోని పెద్దలు పార్టీలకు అతీతతంగా వద్దిరాజు మెమోరియల్ పార్కులో సమావేశమయ్యారు. గ్రామానికి చెందిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, గుత్తేదారు ఎస్.ఎం.హుస్సేన్ గ్రామానికి రెండు వైకుంఠ రథాలను అందించేందుకు ముందుకు వచ్చారు. కార్యక్రమానికి వద్దిరాజు పెద్ద వెంకన్న, కూటికంటి మధు, బేతమల్ల చంద్రయ్య, చిన్నాల కట్టయ్య, బొబ్బిలి మహేందర్‌రెడ్డి, గుజ్జునూరి బాబురావు, గండు నాగన్న తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్ ఛైర్ అందజేత

కురవి, న్యూస్‌టుడే: కురవి మండలం రాజోలుకు చెందిన దివ్యాంగుడు నరేశ్‌కు ఇన్‌స్టాగ్రామ్ రఘు ఆదివారం వీల్‌ఛైర్ అందించారు. యువకులు సంతోష్, యాకన్న, కార్తీక్ పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

నర్సింహులపేట, న్యూస్‌టుడే: మండలంలోని బొజ్జన్నపేట గ్రామంలో గౌడ కులస్థులకు సమాచారం ఇవ్వకుండా తాటి చెట్లను తొలగించిన వారిపై చర్యలు తీసుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గునిగంటి మోహన్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయం ఎదుట గీత కార్మికులతో నిర్వహించిన సమావేశంలో ఆదివారం మాట్లాడారు. బొజ్జన్నపేట గ్రామానికి చెందిన వ్యక్తి ఎలాంటి సమాచారం లేకుండా జేసీబీతో తాటి చెట్లను తొలగించారన్నారు. కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షుడు డొనికెన రామన్న, గౌడ సంఘం నాయకులు మెరుగు కృష్ణ, వెంకన్న, ఏకాంబ్రం, రమేష్, శ్రీను, మార్క రమేష్, గాడిపెల్లి వీరన్న, రవి, శ్రీను, వెంకన్న, మల్లయ్య, పలువురు గ్రాస్థులు, కల్లుగీత కార్మిక సంఘం నాయకులు పాల్గొన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు


గణపతి విగ్రహం వద్ద గరిక పూజ

మహబూబాబాద్ టౌన్, న్యూస్‌టుడే: శ్రీ రామమందిరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో ఆదివారం శ్రీ లక్ష్మీ గణపతికి విగ్రహానికి అభిషేకం, అర్చన, లక్ష గరిక పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ కమిటీ బాధ్యులు దేవరశెట్టి ప్రభాకర్, సుగుణ, ఎస్వీ నాగేశ్వరరావు, సోమ విశ్వనాథం, రామారావు, సోమ శ్రీనివాస్, రజిత, రాంబాబు తదితరులున్నారు.

28న రాష్ట్ర సదస్సు

కేసముద్రం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఈ నెల 28న నిర్వహించనున్న బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చొప్పరి శేఖర్ కోరారు. మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం ఆ సంఘం మండల నాయకులతో సమావేశం నిర్వహించారు.